ప్రజాశక్తి

మంగళవారం 10 జనవరి 2023 5 విజయనగరం

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. శృంగవరపుకోట పరిసర ప్రాంతాల నుంచి సుమారు 300 మందికి పైగా యువత హాజరయ్యారు. 85 మంది ఆర్అండ్ఆర్ ఎక్స్ట్రీమ్ సొల్యూషన్స్ కంపెనీకి ఎంపికైనట్లు జెకెసి కోఆర్డినేటర్ జి.ఈరన్న తెలిపారు. వీరికి నియామక పత్రాలను కంపెనీ సిఇఒ ఎస్.కిరణ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, ఎపిఎస్ఎస్డిసి జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ భాస్కర్, ఈరన్న అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేష్కుమార్, కె.వాసుదేవరావు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ సి.వి.ఎస్.రవీంద్రనాథ్, శ్రీలక్ష్మి, భాస్కర్, చల్లా శ్రీనివాసరావు, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

చిట్టీలు కట్టి మోసపోవద్దు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజలు తమ కష్టార్జితంతో పొదుపు చేసుకున్న డబ్బును మదుపు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, రిజిష్టర్ అయిన సంస్థల్లో మాత్రమే మదుపు చేయాలని సూచించారు. జిల్లాలో 44 రిజిస్టర్ అయిన సంస్థలు ఉన్నాయని తెలిపారు. రిజిష్టర్ చిట్ఫండ్ కంపెనీ ల్లో కట్టిన చిట్టీలకు మాత్రమే భద్రత ఉంటుందని స్పష్టం చేశారు. పప్పుల చిట్టీలు, ఇతర ప్రయివేటు చిట్టీలవల్ల మోసపోయే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని, ఇలాంటివాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో జిల్లాలో పప్పుల చిట్టీవల్ల భారీగా మోసపోయిన విషయాన్ని ప్రస్తావించారు. ఇలాంటి వారు, ప్రజలకు నమ్మకం కల్గించేందుకు కొంతకాలం పాటు సజావుగా చిట్టీ నిర్వహిస్తారని, అనంతరం పరారవుతారని చెప్పారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇలాంటి అనధికార చిట్టీలు, పప్పుల చిట్టీల పట్ల అప్రమత్తంగా ఉండి, ముందుగానే అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తే, చర్యలు తీసుకుంటామని సూచించారు.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గత 4 రోజులుగా చలి చంపేస్తోంది. ఏజెన్సీలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు 8 నుంచి 10 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు గజగజలాడి పోతున్నారు. చుట్టూ కొండలు, అడవులు దగ్గరగా ఉండడంతో దట్టమైన పొగ మంచుతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. మైదాన ప్రాంతమైన బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి,సాలూరు తదితరు మండలాల్లోనూ ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి.

చలి.. పులి

ఏజెన్సీలో దట్టంగా కురుస్తున్న మంచు

8 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో చలి పంజా విసురుతోంది. సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రారంభమైన మంచు ప్రభావం మరుసటి రోజు ఉదయం 11 గంటల వరకు ఉండడంతో రోజంతా చలి తీవ్రత కనిపిస్తోంది. దీనికి తోడు చలి గాలులు కూడా వీస్తున్నాయి. అత్యల్ప ఉష్ణోగ్రతలు డిగ్రీలు నమోదవ్వడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనులపై వేరే ప్రాంతాలకు ప్రయాణాలు సాగించేవారు సాయంత్రం అయ్యేసరికి ఇళ్లకు చేరుకుంటున్నారు. దూరప్రాంతం ప్రయాణించేవారు సూర్యుని కాంతి చూశాక బయలు దేరుతున్నారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు, యువత చలిని తట్టుకునేందుకు చలి మంటలు వేసుకొని వెచ్చదనం పొందుతున్నారు. రగ్గులు, స్వెట్టర్లకు గిరాకీ పెరిగింది. చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుని బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు.

జియ్యమ్మవలస : గత మూడు రోజులుగా చల్లని గాలులు వీయడంతో చలి తీవ్రత పెరిగి మంచు కూడా పడడంతో ప్రజలు చలిమంటలు వేసుకుంటున్నారు. గత మూడు నాలుగు ఏళ్లగా చలి తెలియని ప్రజానీకానికి ఒకేసారి చలి పంజా విసిరింది. దీంతో మూలన పడేసిన చలి కోట్లు, రగ్గులు తీసుకొని బయట తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం 11 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతకు పడిపోయింది. ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత ఉంటోంది. నాలుగైదు రోజులు పాటు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని వాతావరణశాఖ అధికారులు అంటున్నారు.

వంగర : మండలంలో గత మూడు రోజులుగా ఉదయం, రాత్రి వేళల్లో వీస్తున్న చలి గాలులతో ప్రజలు వణుకు పోతున్నారు. వాహనాలపై ప్రయాణం చేయడానికి చలికి భయపడుతున్నారు. కార్మికులు పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలం చుట్టూ నాగావళి, సువర్ణ ముఖి, వేగావతి నదులతో పాటు మడ్డువలస జలాశయం ఉండడంతో చలి గాలులు మరింత ఎక్కువగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు.

చలిమంట కాగుతున్నచిన్నారులు

వైద్య కళాశాల నిర్మాణం వేగవంతం

- వచ్చే ఏడాది నుంచే తరగతులు ప్రారంభం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని
- వైద్య కళాశాల పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం (2023-24) నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని వెల్లడించారు. కళాశాల నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. రూ.35 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న తాత్కాలిక భవనాల నిర్మాణం దాదాపు ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తవుతుందని మంత్రి చెప్పారు. జిల్లా కేంద్రంలోని గాజులరేగ వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, వైద్య ఆరోగ్య ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్డి మురళీధర్ రెడ్డి తో కలసి పరిశీలించారు. వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ అధికారులు, నిర్మాణ సంస్థ ఎన్.సి.సి. ప్రతినిధులు నిర్మాణ పనుల ప్రగతిని మంత్రికి వివరించారు. రాష్ట్రంలో నిర్మాణం పనులు ప్రారంభించిన ప్రభుత్వ కళాశాలల్లో మచిలీపట్నం, విజయనగరంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వైద్య ఆరోగ్య ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు మంత్రికి వివరించారు.

అనంతరం మంత్రి విడదల రజని మీడియాతో మాట్లాడుతూ రూ.500 కోట్ల వ్యయంతో ఇక్కడ వైద్య కళాశాల ఏర్పాటవుతుందని చెప్పారు. 150 సీట్లతో వైద్య కళాశాల వచ్చే ఏడాది ప్రారంభం అవుతుందని, తద్వారా ఈ ప్రాంత ప్రజలకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు.

రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా

జిల్లా సర్వజన ఆసుపత్రిని మంత్రి విడుదల రజని తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన ఓపి రిజిస్ట్రేషన్ బ్లాక్, సెమినార్ హాలును ముందుగా సందర్శించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, వార్డులను, ఐసియు విభాగాలను తనిఖీ చేశారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. రోగుల పేర్లను నమోదు చేసిన రిజిష్టర్లను పరిశీలించారు. మహిళల జనరల్ వార్డులో రోగులతో మాట్లాడి, వైద్య సేవలు, మందుల సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. ఈ పర్యటనలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్ఎ బొత్స అప్పలనరసయ్య, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఎపిఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధరెడ్డి, వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఇఇ సత్య ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, డిఎంఅండ్హెచ్ఒ డాక్టర్ ఎస్వి రమణకుమారి, డిసిహెచ్ఎస్ గౌరీ శంకర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలత, ఆసుపత్రి సూపరింటిండెంట్ అప్పలనాయుడు, కార్యక్రమంలో ఆర్డిఒ సూర్యకళ, డిఎంహెచ్ఒ రమణ కుమారి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ లీల తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి రజని

ఎన్టిఆర్ ఆశయ బాటలోనే..

టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు అశోక్గజపతిరాజు

ఎన్టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అశోక్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్టిఆర్ ఏ ఆశయంతో పార్టీని స్థాపించారో అదే ఆశయాలతో నేటికీ కొనసాగుతోందని టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు పి.అశోక్గజపతిరాజు అన్నారు. పార్టీ ఏర్పాటై 40 ఏళ్లయిన సందర్భంగా సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముందుగా ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సుదీర్ఘ చరిత్రలోనే అనేక సార్లు అధికారం లోకి వచ్చామని, ప్రతి పక్షం లోనూ ఉన్నామని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు, మహిళలకు అవకాశాలు ఇచ్చిన పార్టీ తమదని, భాషను, సంస్కృతిని కాపాడడంలో పార్టీ క్రియాశీలకపాత్ర పోషించిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రం రివర్స్ గేర్ లో వెళ్తుందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన డబ్బులను కూడా నొక్కేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విపరీతమైన పన్నులతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. బ్రిటీష్ కాలం నాటి నియంత చట్టాలను తీసుకొస్తున్నారని తెలిపారు.జీవో నెంబర్ ఒకటి తో ప్రతిపక్షాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగ వ్యతిరేక పనులపై తామెప్పుడూ పోరాటం చేస్తునే ఉంటామని అన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర పార్టీ అధ్యక్షులు లక్ష్మీవర ప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, నాయకులు కంది మురళీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసగించిన రక్ష డిఫెన్స్ అకాడమీ

చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ వినతి

కలెక్టర్కు ఫిర్యాదుచేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆర్మీలో యువతకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామంటూ యువతను మోసగించిన రక్ష డిఫెన్సు అకాడమీ నిర్వాహకులపై చర్య తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ హరీష్, రుద్రప్రసాద్ స్పందనలో జిల్లా కలెక్టర్ సూర్యకుమారికి ఫిర్యాదు చేశారు. వేశాల కుమార స్వామి అనే వ్యక్తి రక్ష డిఫెన్స్ అకాడమీ అనే సంస్థ 160 మందితో ర్యాలీ నిర్వహించి, ర్యాలీలో ఎంపికైన వారికి ఉచిత కోచింగ్ అని చెప్పి ఒక్కొక్కరి నుండి లక్ష నుండి 3 లక్షల వరకు వసూలుచేసి పరారయ్యాడని తెలిపారు. ఉద్యోగం ఇస్తానని అగ్రిమెంట్ కూడా ఇచ్చారని, ఉద్యోగం రానియెడల డబ్బు తిరిగి చెల్లిస్తామని రాసి ఇచ్చాడని, డబ్బు తిరిగి ఇవ్వాలని అడుగుతుంటే కోర్డులో కేసు వేశాడని కలెక్టర్కు వివరించారు. కుమార స్వామిపై క్రిమినల్ కేస్ పెట్టించి, బాధితులకు డబ్బులు అందేలా చూడాలని కలెక్టర్ను కోరారు. వినతినిచ్చి వారిలో రక్ష డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వెంకటేష్, సాయి, బాలాజీ,తేజ,బి. సాయి పాల్గొన్నారు.

పెండింగ్ లేకుండా పరిష్కరించాలి : కలెక్టర్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 151 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 77 ఉన్నాయి. డిఆర్డిఎ కు 28, హౌసింగ్ కు 8, మున్సిపల్ శాఖకు 7, వైద్య శాఖ కు 13, మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. కలెక్టర్ ఎ. సూర్యకుమారి, డిఆర్ఒ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వినతులను పెండింగ్ పెట్టకుండా గడువు లోగా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు.

రైతులతో మాట్లాడుతున్న ఎస్డిసి సుదర్శన దొర

నిలువునా దోచేశారు

- ప్రత్యేక ఉపకలెక్టర్ ఎదుట రైతుల మొర
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - జామి

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు నిలువునా దోచేశారంటూ ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన దొర ఎదుట రైతులు వాపోయారు. రైతుల నుంచి మిల్లర్లు అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారన్న దానిపై ప్రజాశక్తి వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు రైతులు నేరుగా ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన దొరను విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఈ నేపథ్యంలో సోమవారం జామి మండలంలో గల రైతులను తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ సతీష్, వ్యవసాయాధికారి కిరణకుమార్ సమక్షంలో సుదర్శన దొర విచారించారు. రైతుల నుంచి నేరుగా వివరాలు సేకరించారు. అయితే రాధాకృష్ణ, శ్రీనివాస రైస్ మిల్లు యాజమాన్యాలు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రైతుల నుంచి భారీగా వసూలు చేసినట్లు విచారణ అధికారి ఎదుట స్పష్టం చేసినట్లు తెలిసింది. రైతుల నుంచి వాంగ్మూలం నమోదు చేసుకున్న అధికారులు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సమాచారం. విచారణలో తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ను సందర్శించిన ఎయు డైరెక్టర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయంలో ఎఆర్విఆర్, ఆనాటమి, రేడియోలజీ తదితర ప్రయోగశాలలు సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ఉన్నత విద్యా రంగానికి చేస్తోన్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డీన్లు ఎంఎల్ఎన్ ఆచార్యులు, సన్నీ డియోల్, ప్రొఫెసర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ ఎన్నిక

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య,(ఫాప్టో) విజయనగరం జిల్లా నూతన కమిటీ 2023-25కు గాను ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఫ్యాప్టోఈ భాగస్వామ్య సంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర పరిశీలకులుగా నాయకులు గణపతి రావు హాజరయ్యారు. చైర్మన్గా బి.మహేశ్వరరావు (ఆప్టా) కార్యదర్శిగా సిహెచ్ వెంకటరమణ (ఎపిటిఎఫ్ 1938), డిప్యూటీ సెక్రెటరీ జనరల్గా జె.రమేశ్చంద్ర పట్నాయక్ (యుటిఎఫ్), డి.శ్యామ్ (ఎస్టియు), పి.శ్రీనివాస్ (ఎపిటిఎఫ్ 257), కార్యదర్శిగా వేణుగోపాలరావు (హెచ్ఎంల అసోసియేషన్), కార్యవర్గ సభ్యులుగా జెవిఆర్కె ఈశ్వరరావు, వై.అప్పారావు, షేక్ బుకారిబాబు, డి.ఈశ్వరరావు, టి.సన్యాసిరాజు ఎన్నికయ్యారు.

ధర్నా చేస్తున్న పింఛనుదారులు

ఒకటో తేదీకే పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు ప్రతినెలా ఒకటిన పింఛను ఇవ్వాలని పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు రౌతు రామ్మూర్తి డిమాండ్ చేశారు. పెన్షన్ ప్రతినెల ఒకటిన ఇవ్వాలని కోరుతూ సబ్ ట్రెజరీ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెన్షన్ రాకపోవడంతో వైద్యానికి, మందులు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. ప్రతినెల ఒకటిన పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి యూనిట్ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, పి.సత్యంనాయుడు, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక గురజాడ పబ్లిక్ స్కూలులో సోమవారం వ్యాయమ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఖేల్ ఇండియా రిజిస్ట్రేషన్లో ప్రతి విద్యార్థి వివరాలు ఉండే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఖేల్ ఇండియా ప్రోగ్రాం విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించేందుకు పెట్టిందని తెలిపారు. అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరపాలి అన్నది ప్రోజెక్టర్ ద్వారా వివరించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్వి రమణ అధ్యక్షతన జరిగిన శిక్షణలో 270 మంది వ్యాయమ ఉపాధ్యాయులు, డిప్యూటీ డిఇఒలు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం

ప్రజాశక్తి-బొబ్బిలి

వేణుగోపాల స్వామి ఆలయంలో సోమ వారం పుష్ప యాగం వైభవంగా జరిగింది. పలు రకాల పువ్వులతో వేణుగోపాల స్వామికి ఆలయ ధర్మకర్తలు సుజయకృష్ణ, బేబి నాయన పూజలు చేశారు.

పుష్పయాగానికి పూలను తీసుకెళ్తున్న బేబినాయన

బాధితులకు అండగా ఉంటాం

చెక్కులు, త్రిచక్ర వాహనాల పంపిణీలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

త్రిచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం

బాధిత వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తించేలా, ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. సోమవారం తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నగరానికి చెందిన ముగ్గురికి రూ.6.45 లక్షల విలువ గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో మంజూరు చేసిన రూ.2.76 లక్షల విలువ గల మూడు త్రిచక్ర స్కూటీలను విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లలో పేదల సంక్షేమం కోసం చేపట్టిన పథకాల గురించి వివరించారు. జిల్లాలో సుమారు 70 స్కూటీలను ప్రభుత్వం మంజూరు చేసిందని, అందులో విజయనగరం నియోజవర్గంలో ముగ్గురికి స్కూటీలను కేటాయించారని తెలిపారు. అనారోగ్యాల కారణంగా ఇబ్బంది పడిన స్థానికులకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందజేసి మెరుగైన చికిత్స అందజేశామని ఆయన గుర్తు చేశారు.

ఆరుగురికి రూ.9.21 లక్షల ఆర్థిక చేయూత

ఒక్కొక్క స్కూటీ విలువ రూ.92 వేలు కాగా రూ.2.76 లక్షలు వెచ్చించి నగరానికి చెందిన ముచ్చ లక్ష్మీ, దాసిరెడ్డి ఉమామహేశ్వరి, రౌతు ధనలక్ష్మిలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేతుల మీదుగా సంబంధిత తాళాలు అందజేశారు. అశోక్ నగర్ కు చెందిన సారిక అఖిలకు రూ.2 లక్షలు, చిక్కాల వీధికి చెందిన కిల్లంపూడి సాయి ఈశ్వర్ మోహన్ కుషాల్కు రూ.45 వేలు, కె.ఎల్. పురానికి చెందిన నడింపల్లి వెంకట రామకృష్ణరాజుకు రూ.4లక్షల చొప్పున సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, విభిన్న ప్రతిభావంతుల విభాగం సహాయ సంచాలకులు జగదీష్, స్థానిక ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరంటౌన్ : అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న 108 ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 108 సర్వీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం కోలగట్లను తన నివాసంలో కలసి సమస్యలను వివరించారు. 108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, జీతాల పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు జికె మోహన్, ఎ.రాజు, వి.కృష్ణ, వై.పైడిరాజు పాల్గొన్నారు.

పన్ను విధింపునకు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఖాళీ స్థలాల పన్ను విధింపునకు కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 13 వరకు ప్రత్యేక కౌంటర్లలో ఖాళీ స్థలాల పన్ను విధింపు ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు ప్రకటించారు. మధ్యవర్తులు, దళారులు లేకుండా నేరుగా పన్ను విధింపు చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలు, ఇసి, ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువీకరణ, 250 రూపాయల చలానా సమర్పిస్తే 72 గంటల్లో ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తామని చెప్పారు.

బిఎల్ఒ సస్పెన్షన్

ప్రజాశక్తి-విజయనగరం

బిఎల్ఒగా విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి సస్పెండ్ చేశారు. విజయనగరం కార్పొరేషన్ 40వ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ పొదిలాపు కనకరాజు ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు.. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్అంబాసిడర్ల ధర్నా

బకాయి వేతనాలు చెల్లించాలని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెంచిన పదివేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ అంబాసిడర్లు సోమవారం సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2430 మంది (గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి సుమారు 7 నుంచి 15 నెలల వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. స్వచ్ఛ భారత్ స్కీమ్ లో భాగంగా మార్చినెల వరకు జీతాలు ఇచ్చారని, ఆ తరువాత ఇవ్వలేదని తెలిపారు. బకాయి వేతనాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యగ భద్రత కల్పించి పిఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. గుర్తింపుకార్డులు, ప్రమాద బీమా చెల్లించాలన్నారు. ధర్నాలో సిఐటియు నాయకులు వి.లక్ష్మి, వి.శ్రీను, కనకరాజు, వెంకట్, కార్మికులు పాల్గొన్నారు.

రెండో కౌన్సిలింగ్లో

ఎంఆర్ లా కళాశాలను వెబ్ఆప్షన్లో పెట్టాలి

పిపిఎస్ఎస్ కార్యదర్శి శంకర్రావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంఆర్ లా కాలేజీకి అడ్మిషన్లు జరపాలని, అందుకనుగుణంగా రెండో విడత కౌన్సిలింగ్లో లా కళాశాలను వెబ్ ఆప్షన్లో పెట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టర్కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్సాస్ యాజమాన్యం కమిటీ తీర్మానం చేయకుండా, ప్రిన్సిపాల్, స్టాప్కు తెలియకుండా, అశోక్ గజపతిరాజు చైర్మన్గా ఉంటుండగానే, కరస్పాండెంట్ ద్వారా లా కళాశాల ఎత్తి వేసేందుకు పని పూర్తి చేశారన్నారు. లా కళాశాలలో ప్రస్తుతం 126 మంధి విద్యార్థులున్నారని తెలిపారు. ఒక్కొక్కరికి 11,500 ఫీజు అంటే 11లక్షల 50 వేలు సంవత్సరానికి వస్తున్నదని, ప్రస్తుతం లా కాలేజీ అకౌంట్లో రూ.30లక్షలు ఉన్నాయని తెలిపారు. నెలకు లక్షా రూ.16 వేలు మాత్రమే స్టాఫ్ జీతాలు ఖర్చవుతుందన్నారు. ఈ ఏడాది 120 మంది జాయిన్ అయితే వారి ఫీజు ఇంకో 12లక్షలు వస్తుందని తెలిపారు. అయినా ప్రభుత్వం నిర్ణయించే ఫీజులు సరిపోవని కారణం చెప్పి అడ్మిషన్లు ఆపడం అన్యాయమన్నారు. అదికూడా కాలేజీలో స్టాప్కు, ప్రిన్సిపాల్కు తెలియకుండా, బోర్డు మీటింగు తీర్మానం చేయకుండా, కరస్పాండెంట్, చైర్మన్ నిర్ణయించడంతో, దాన్ని ఎండోమెంట్ ఇఒ ప్రసాదరావుకు చెప్పి అడ్మిషన్లు ఆపారన్నారు. ఇది కేవలం యాజమాన్యం దుష్ట ఆలోచనే తప్ప మరొకటి కాదన్నారు. మరో వైపు ప్రభుత్వము పట్టించుకోక పోవడం సరి కాదని, వెంటనే రెండో కౌన్సిలింగ్లో ఎంఆర్ లా కళాశాల వెబ్ సైట్లో ఆప్షన్ ఉంచడానికి ప్రయత్నించాలని కలెక్టర్ను కోరారు.

గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన సిఎం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

కొత్తవలస.. మాట్లాడుతున్న ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చి , బాపూజీ కలలను సాకారం చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆనాడు చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రకు జనవరి 9వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల కష్టాలను ప్రజాసంకల్పయాత్ర ద్వారా చూసి నేను విన్నాను, నేను ఉన్నాను అంటూ ప్రజలకు భరోసా, ధైర్యాన్ని కల్పించింది జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత . సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, వాలంటరీ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేని విధంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో మూడు లాంతర్లు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. విజయనగరంలో జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల కూడా తీసుకొచ్చిన ఘనత వైసిపిదేనని అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు సుమారు 7500 కోట్ల రూపాయలతో టెండర్లు ప్రక్రియ పూర్తయి, వివిధ పనుల దశలో ఉన్నాయని అన్నారు. రాష్ట్రచరిత్రలో ఎన్నడూ లేని విధంగా నాలుగు లక్షల ఉద్యోగాలను భర్తీ చేశారన్నారు. ఒంటరిగా పోటీ చేసి గెలిచే పరిస్థితి లేకపోవడంతో ప్రతిపక్షాలన్నీ ఏకమై పొత్తులు పెట్టుకుని పోటీ చేసే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని అన్నారు. విలేకరుల సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు, జోనల్ ఇన్చార్జిలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హామీలను 98 శాతం నెరవేర్చాం

కొత్తవలస : రాష్ట్ర వ్యాప్తంగా సిఎం జగన్ చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చామని విశాఖ ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి పాదయాత్ర చేసి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి అన్ని స్థానాలు గెలుచుకొంటుందని జోస్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిందన్నారు. ఈ యాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుని, సంక్షేమ పథకాలను తీసుకురావడం వల్ల ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి కొత్తవలస మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వేపాడ అధ్యక్షులు మిరపల సత్యనారాయణ, నాయకులు బొడ్డు అప్పారావు, పల్లా భీష్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

బొబ్బిలి : వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వైసిపి కార్యాలయంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజల వద్దకు పాలన అందించేందుకు సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకష్ణ, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి.. వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు

నెల్లిమర్ల : సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి నాలుగేళ్లు గడిచిందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. సోమవారం జరజాపు పేట మెయిన్ రోడ్డులో ప్రజా సంకల్ప యాత్రకు మూడేళ్లు గడిచిన సందర్భంగా రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయం కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

సత్తాచాటిన గురుకుల విద్యార్థినులు

ప్రజాశక్తి-వేపాడ

విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 క్రీడా పోటీల్లో స్థానిక బీకర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు సత్తాచాటారు. 3 కిలోమీటర్ల పరుగు పందెంలో పూజిత ప్రథమ, దుర్గాభవాని ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పావని షాట్‌పుట్‌లో మొదటి, జావెలిన్‌త్రోలో రెండో స్థానాల్లో నిలిచింది. వీరు ఈ నెల 20 నుంచి శ్రీకాకుళంలో జరిగే అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ యు.ఈశ్వరాణి తెలిపారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పిఇటి లక్ష్మి, పీడీ అరుణను ఆమె అభినందించారు.

సిఐటియు జెండావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బెంగళూరులో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని స్థానిక మార్కెట్‌యార్డులో సోమవారం ఆ యూనియన్ జెండాను నగర కార్యదర్శి బి.రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు కేంద్ర కమిటీ పిలుపు మేరకు జెండావిష్కరణ చేపట్టినట్లు వివరించారు. భవిష్యత్తు పోరాటాలకు మహాసభ మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అప్పన్న, గౌరు పాల్గొన్నారు.

చెత్త తరలించాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని 29వ డివిజన్ పరిధిలోని చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ ఆధ్వర్యాన సోమవారం కమిషనర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీవరప్రసాద్, కనకల మురళీమోహన్ మాట్లాడుతూ రింగ్ రోడ్ ప్రాంతంలో ఉన్న చెత్త ట్రాన్సిట్ కేంద్రం వద్ద చెత్త పేరుకుపోయిందని, దుర్వాసనతో రామకృష్ణనగర్, ఫోర్ట్‌సిటీ, రింగ్‌రోడ్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కమిషనర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, చెత్తను తరలించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి అవితి రాజు, కనకల మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎస్‌కెఆర్ పురం, చినగుడిపాల పాఠశాలలను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ఎండిఎం రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూ పరిశీలించి, రుచి కూడా చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలు పంచాయతీల్లో గ్రామసభలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో కుంపల్లి, చినగుడిపాల, వీలుపర్తి, చామలాపల్లి, ఎస్‌ఆర్‌పేట, ముకుందపురం, ఒబలయ్యపాలెం, కెజిపూడి పంచాయతీల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి కావాల్సిన పనులను గుర్తించి, ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు శ్మశాన వాటిక కల్పించాలి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని శ్రీహరిపురం దళితులకు శ్మశాన వాటిక కల్పించాలని దళిత ప్రజాసంఘాల జెఎసి నాయకులు మజ్జి గణపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ డి. ఐజాక్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న శ్మశాన వాటిక మడ్డువలస జలాశయంలో కలిసిపోవడంతో ఆ గ్రామ దళితులు ప్రస్తుతం శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్రభుత్వం అమలు చేసిన జీవోను అనుసరించి శ్రీహరిపురం దళితులకు శ్మశాన వాటిక కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి జెడ్‌పి చైర్మన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడకు చెందిన క్యాన్సర్ బాధితుడు లెంక హరినాయుడు వైద్య ఖర్చుల నిమిత్తం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు. సోమవారం తన చాంబర్‌లో కలిసిన ఆ గ్రామ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులకు చైర్మన్ రూ. 25వేలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యన్నారాయణ, హరినాయుడు తండ్రి లెంక ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కింజంగిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 44 జట్లుకు గాను మొదటిరోజు గంగాడ, భాగంపేట, తెర్లాం, బాలకాయవలస, చిలకలపల్లి, గలావల్లి, పలగర, పెనుబాక జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - గరివిడి

శ్రీరామ్ జూనియర్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టీ.కమలాకర్ రావు, ఎకాడమిక్ అడ్వైజర్ బి. రవి, ప్రిన్సిపాల్ భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, గరివిడి సర్పంచ్ ప్రమీల, బ్రహ్మకుమారి లతక్క కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులందరికీ సంక్రాంతి భోగి కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో రంగోలి, ఇతర సాంస్కృతి కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతు అందించారు.

పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి -భోగాపురం

పాఠశాల అభివృద్ధి ప్రణాళికలు, ఆవాస ప్రాంత ప్రణాళికలు సిద్ధం చేయాలని ముక్కాం పాఠశాల సముదాయాల చైర్మన్ గుడివాడ శ్రీదేవి తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు కావలసిన మౌలిక వసతులు సౌకర్యాలు, విద్యార్థులు వివరాలు, ఆవాస ప్రాంతంలోని బడి బయట పిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వారికి కావలసిన సౌకర్యాలు, ఉపాధ్యాయులకు విద్యాభివృద్ధికి అవసరమైన శిక్షణలు, పాఠశాలలో మరుగుదొడ్లు తరగతి గదులు, ఫర్నిచర్ అవసరమైన నిధులు మొదలైన విషయాలపై సమగ్రమైన నివేదికను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో సి.అర్.పి మాతా శేషుబాబు, ఆర్.పి మాసాబత్తుల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు డి సన్యాసిరావు, కె.సత్యవతి, జి గోవింద్, ఎస్‌డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు భోజనాలు ఏర్పాటు

విజయనగరం కోట : ముఖ్యమంత్రిగా ఎన్‌టిఆర్ ప్రమాణ స్వీకారం చేసి 40 ఏళ్లయిన నేపథ్యంలో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి కనకల మురళీమోహన్ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఎంతో ఆనందాన్ని ఇస్తాయని ఆయన అన్నారు.

నేడు సోంపురంలో గడపగడపకు..

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

స్పందించరు.. పనిచేయరు

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

మండల పరిషత్తు సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సభ్యుడు

ప్రజాశక్తి-తెర్లాం

ఏ సమస్య విన్నవించినా పరిష్కారం కావడం లేదని, కనీసం స్పందించడం లేదని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఉమాలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎఎంసి చైర్మన్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కునాయయవలసలో గతంలో తీసుకున్న డ్వాక్రా రుణాలు ఎవరు తీసుకున్నారో, ఆ రుణాలు ఏమయ్యాయో గత మూడు సమావేశాల్లో అడిగినా, ఎపిఎం రాము సరిగా సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనైనా సమస్య పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. గంగన్నపాడు సర్పంచ్ కోట సరోజిని మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్తు సమస్య ఉందని, పాత కరెంట్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని పలుమార్లు విద్యుత్తు శాఖాధికారులకు విన్నవించామన్నారు. ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని అధికారుల తీరుపై అసంతృప్తి చెందారు. ఎంఆర్ అగ్రహారం సర్పంచ్ లొట్టి లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గత రెండు సమావేశాల్లో లేవనెత్తినా, నేటికీ పరిష్కారం కాలేదని అసహనం వ్యక్తంచేశారు. పెరుమాలి సర్పంచ్ హేమలత మాట్లాడుతూ గ్రామంలో కుక్కల బెడద ఎక్కువ ఉందని, సచివాలయ సిబ్బంది పనితీరు బాగోలేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తెర్లాం సర్పంచ్ బోనెల రూప మాట్లాడుతూ పశువైద్యాధికారి ఆస్పత్రి ఎప్పుడు తీస్తారో, ఉంటారో, వెళ్లిపోతారో తెలియడం లేదన్నారు. ఎంపిడిఒ రామకృష్ణ స్పందిస్తూ సమావేశంలో వచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించకపోతే, దీనిపై సభ్యులు విశ్వాసం కోల్పోతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సత్యనారాయణ, రమాదేవి, తహశీల్దార్ రాజేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధే లేదు : టిడిపి

ప్రజాశక్తి- డెంకాడ

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోమ అభివృద్ధే జరగలేదని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కర్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పథకాల పేరిట మభ్యపెడుతుందని విమర్శించారు. చీకటి జీవో ఒకటిని తీసుకువచ్చి ప్రతిపక్షాలను అనగతొక్కడానికి ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్రానికి పెట్టిన వైసిపి కర్మను వదిలించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వీధుల్లో తిరిగి వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రత్తిపాడు అప్పలనాయుడు, శివరామ విద్యాసాగర్ నాయుడు, పతివాడ రామానాయుడు, పానీరాజు, ప్రదీప్ రాజు, ఎంపిటిసి కోరాడ రమణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

కనీస వేతనాలివ్వాలని అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-బాడంగి

అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు నాయకులు సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బాలమురళికి సురేష్ ఆధ్వర్యాన అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరించొద్దన్నారు. అంగన్వాడీలకు పిఎఫ్, ఇఎస్ఐ, పింఛను సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఫేస్ యాప్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోషణ మెస్‌ఛార్జీలు పెంచాలని, జిఒ 1ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రవణమ్మ, సీత, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

ఎస్‌ఇబి సిఐ జైభీమ్

ప్రజాశక్తి-బొబ్బిలి

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతాయని, డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్‌ఇబి సిఐ ఆర్.జైభీమ్ కోరారు. వాసు జూనియర్ కళాశాలలో సోమవారం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రతి ఏడాది డ్రగ్స్ వినియోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్ వినియోగించినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఇబి ఎస్ఐ చిన్నంనాయుడు, కళాశాల, ఎస్‌ఇబి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి పంపుదాం

జనసేన నాయకులు పితాని బాలకృష్ణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రణస్థలంలో ఈ నెల 12న జరిగే యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేసి, వైసిపిని ఇంటికి పంపుదామని జనసేన సీనియర్ నాయకులు పితాని బాలకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు ఆధ్వర్యంలో సోమవారం హోటల్ జిఎస్‌ఆర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో యువతతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు కూలీల్లా వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు ఉన్నా వెనుకుబాటుతనం పోగొట్టడానికి, యువతలో చైతన్యం తెచ్చేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ యువశక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉత్తరాంధ్రలోని వైసిపి మంత్రులు, నాయకులు బాగుపడ్డారే తప్ప ప్రజలను, యువతను గాలికొదిలేశారని వాపోయారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, గురాన అయ్యలు మాట్లాడుతూ యువశక్తి కార్యక్రమానికి భారీ ఎత్తున తరలి రావాలని కోరారు. జనసేన నాయకులు ఆదాడ మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు లోకం మాధవి, ఉత్తరాంధ్ర వీర మహిళా రీజనల్ కో-ఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్, చేనేత విభాగం కార్యదర్శి కాటం అశ్విని, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు డోల రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : యువశక్తి సభను జయప్రదం చేయాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కోరారు. రాజా కళాశాల మైదానంలో సోమవారం యువశక్తి పోస్టర్లను విడుదల చేశారు. యువశక్తి సభకు యువత తరలి రావాలని కోరారు.

డెంకాడ : యువశక్తి సభను విజయవంతం చేయాలని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస యశస్వి కోరారు. మండలంలోని ఒమ్మిపేటలో జనసేన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన నాయకులు గురాన అయ్యలు, లోకం మాధవి, లక్ష్మీరాజ్ పాల్గొన్నారు.

జనసేనలోకి శ్రీను మహంతి!

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఐఐఎఫ్ఎస్ఇ సిఇఒ శ్రీను మహంతి త్వరలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన ఆ పార్టీ కీలక నేత నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం భోగాపురం సన్‌రే రిసార్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. నెల్లిమర్ల నియోజకవర్గ కీలక నేత లోకం నాగ మాధవి.. శ్రీనును పరిచయం చేశారు. చిన్నప్పటి నుండి పవన్ కళ్యాణ్‌పై అభిమానంతో పవన్‌కళ్యాన్‌ను కలిసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలుస్తుంది. ఈ నెల 12న రణస్థలంలో జరిగే యువశక్తి కార్యక్రమానికి పవన్‌కళ్యాన్ వస్తున్నారు. ఆయన సమక్షంలో ఆపార్టీ కండువా కప్పు కోవడానికి సిద్ధ పడుతున్నట్లు ఆయన సన్నిహితులు చెబు తున్నారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన శ్రీను

3 రోజుల్లో గృహసారథుల నియామకం

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

గృహ సారథుల నియామకాలను మూడు రోజుల్లో పూర్తి చేయాలని కన్వీనర్లను ఎమ్మెల్యే అప్పలనర్సయ్య ఆదేశించారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో దత్తిరాజేరు, గజపతినగరం మండలాల నాయకులు, కన్వీనర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఏ ఒక్కరి సొంతం కాదని, అందరినీ కలుపుకుపోవాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో చాలా సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. గృహసారుల నియామకం పూర్తయిన తర్వాత వాలంటీర్‌తోపాటు కన్వీనర్, గృహసారథులు కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. నెల మొదలుకొని పింఛను ఇచ్చే రోజు నుంచి చివరిరోజు వరకు అందరూ కలిసి ప్రతి గడపనూ సందర్శించి వారికి అందుతున్న సంక్షేమాన్ని వివరించాలని అన్నారు. నియోజకవర్గంలో మిగిలిన 22 రోడ్లను పండగ తర్వాత ప్రారంభిస్తామని చెప్పారు. గ్రామాల్లో ఏవైనా అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గ్రాండ్స్‌ని కూడా వాడుకోవచ్చని సర్పంచులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తాము చదువు నేర్పే పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించిన ఉపాధ్యాయులు కొట్టంశెట్టి శ్రీనివాసరావు, దుడిగళ్ల జానకిరామును లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల ప్రసాద్ సత్కరించారు. సోమవారం మండలంలోని భర్తాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాయువానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో శ్రీనివాసరావు, అంబదేసుపాలెం ప్రభుత్వ పాఠశాలలో జానకిరామ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని చెప్పారు. ప్రతిరోజూ వీరితోపాటు పిల్లలను పాఠశాలలకు తీసుకురావడం ప్రభుత్వ విద్యపైన వారికున్న నమ్మకమేనని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొట్టాపు వెంకటరమణ, గ్రామ నాయకులు కె.సత్యనారాయణ, కె.శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రసాద్, వెంకటరమణ

వాసవి క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వాసవి క్లబ్ శృంగవరపుకోట యువత నూతన అధ్యక్షులుగా ఆదిమూలం సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శివకుమార్, కోశాధికారిగా యు.విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వాసవియన్ సిల్వర్ స్టార్ కెసిజిఎఫ్ ఆదిమూలం రత్నావతి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆత్మకూరు సతీష్ ఆధ్వర్యాన నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ బాలనాగు శ్రీనివాస్, రీజినల్ సెక్రటరీ ఆదిమూలం హరీష్‌కుమార్, రీజినల్ చైర్మన్ వంకదార సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

నేను సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రతి సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు లంక వాసు, బొంగు సంతోష్ చెప్పారు. 273 వారాల నుంచి ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కొత్తవలస

క్రీడాకారులతో శారద పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు

కొత్తవలస హైస్కూల్ మైదానంలో సోమవారం శారద కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు తొలిరోజు హోరాహోరీగా సాగాయి. పోటీలను తహశీల్దార్ ఎం.ప్రసాదరావు, సిఐ ఎస్.బాల సూర్యారావు, శారద కంపెనీ సీనియర్ జిఎంలు ప్రభాత్ మోహన్, అనంత్ కుమార్ ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజులు పాటు జరుగుతాయని జిఎంలు తెలిపారు. మండలం నుంచి 33 జట్లు వచ్చాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు చెప్పారు. పోటీలకు రిఫరీగా వాలీబాల్ జాతీయ కోచ్ గవర సూరిబాబు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కృష్ణంరాజు, రెఫరీ ఎల్‌జిఎన్ కుమార్ వ్యవహరించారు.

పోటీలను శారద కంపెనీ హెచ్‌ఆర్ డిజిఎం హెచ్.సన్యాసిరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కంపెనీ జిఎంలు విజయ భాస్కర్, ఎస్.సింగ్, వెంకట శివ, సీనియర్ మేనేజర్ మురళీకృష్ణ, మేనేజర్ పద్మాకర్, హెచ్‌ఆర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సత్కారం

ప్రజాశక్తి-వేపాడ

ఎంపిడిఒను సత్కరిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్‌ను ఎంపిపి దొగ్గ సత్యవంతుడు సత్కరించారు. మండలంలో చిట్టి గురువులు కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్‌కు ఇటీవల కలెక్టర్ సూర్యకుమారి అవార్డును అందజేశారు. దీంతో ఎంపిడిఒను ఎంపిపి ఆధ్వర్యాన సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శాలువాతో కప్పి సత్కరించారు.

రైలు ఢీకొని పశువుల వ్యాపారి మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని ఎం.బూర్జవలస సమీపంలో రైలు ఢీకొని పశువుల వ్యాపారి కునుకు సూర్యనారాయణ (38) మృతి చెందాడు. సిహెచ్.బొడ్డవలసకు చెందిన సూర్యనారాయణ పశువుల కొనుగోలుకు సోమవారం ఎం.బూర్జవలస వచ్చాడు. ఆయన పూటుగా మద్యంతాగి రైలు పట్టాలు దాటుతుండగా బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్తున్న రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ఆయన మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సూర్యనారాయణకు ఇద్దరు భార్యలు, పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.